
ఆంధ్రజ్యోతి



నిజామాబాద్
జిల్లా వార్తలు

76.18 శాతం రేషన్ ఈకేవైసీ పూర్తి

- ఫిబ్రవరి నెలాఖరు వరకు ఈకేవైసీకి గడువు

నిజామాబాద్ అర్బన్, జనవరి 28: జిల్లాలో ఆహార భద్రతాకార్డుదారుల ఈకేవైసీ 76.18 శాతం పూర్తయింది. జిల్లాలో 4లక్షల 2వేల 52 బీపీఎల్ కార్డులు ఉండగా 12లక్షల 83వేల 499 మంది లబ్ధిదారులు ఉన్నారు. జిల్లాలో 9లక్షల 77వేల 828 మంది పూర్తి చేసుకోగా 3లక్షల 5వేల 671 మంది ఇంకా ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫిబ్రవరి చివరి వరకు పూర్తి చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్ జిల్లా అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.



వీసీల నియామకాలకు గ్రీన్ సిగ్నల్





- వర్సిటీలకు కొత్త వీసీల నియామకానికి ప్రభుత్వం నోటిఫికేషన్
- తెలంగాణ విశ్వవిద్యాలయానికి రానున్న నూతన వైస్ చాన్స్‌లర్
- టీయూ కొత్త వీసీ కోసం పలువురు ప్రొఫెసర్ల దరఖాస్తు
- దశాబ్దంన్నర గడిచినా వర్సిటీలో అన్నీ సమస్యలే..

నిజామాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రభుత్వం కొత్త వీసీ (వైస్ చాన్స్‌లర్)ల నియామకానికి చర్యలు చేపట్టింది. తెలంగాణ విశ్వవిద్యాలయంతో పాటు పది విశ్వవిద్యాలయాలకు కొత్త వీసీలను నియమించేందుకు సిద్ధమవుతోంది. కొత్త వీసీల నియామకం కోసం దరఖాస్తులను స్వీకరించేందుకు నోటిఫికేషన్‌ను జారీ చేశారు. ప్రొఫెసర్‌గా పదేళ్ల పూర్తి చేసుకున్న వారు దరఖాస్తు చేసుకోవాలని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. తెలంగాణ విశ్వవిద్యాలయం గడిచిన ఆరు నెలలుగా వీసీ లేరు. ఇక్కడ పనిచేసిన వీసీ ఏసీబీకి పట్టుపడటంతో అప్పటి నుంచి ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి ఇన్‌చార్జిగా పనిచేస్తున్నారు. రిజిస్ట్రార్ ఆధ్వర్యంలోనే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పూర్తిస్థాయి వీసీ లేకపోవడం వల్ల విశ్వవిద్యాలయం పరిధిలో సమస్యలు పట్టించుకునే వారు లేరు.

మేలో ముగియనున్న వీసీల పదవీ కాలం

రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల వీసీల పదవీకాలం మరో నాలుగు నెలలు ఉంది. వీరి పదవి కాలం వచ్చే మే నెలతో ముగియనుంది. నాలుగు నెలల సమయం ఉండగానే ప్రభుత్వం విశ్వవిద్యాలయాలపై నజర్ పెట్టింది. వీసీల పదవి పూర్తయ్యేలోపే కొత్త వీసీలను నియమించేందుకు సిద్ధమవుతోంది. వచ్చేనెల 12 వరకు వీసీ పోస్టుల కోసం దరఖాస్తు చేసుకోవాలని నోటిఫికేషన్ విడుదల చేసింది. వీసీగా దరఖాస్తు చేసుకునే వారికి పదేళ్ల ప్రొఫెసర్‌గా పనిచేసి ఉండాలని నిబంధనల్లో పేర్కొన్నారు. తెలంగాణతో పాటు రాష్ట్రంలోని పది విశ్వవిద్యాలయాల కోసం ఈ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వచ్చే దరఖాస్తుల ఆధారంగా ప్రభుత్వం విశ్వవిద్యాలయాలకు సెర్చ్ కమిటీని నియమిస్తుంది. ముగ్గురు కమిటీల సభ్యులు వచ్చిన దరఖాస్తులకు ఆధారంగా ముగ్గురు పేర్లను ఎంపిక చేస్తారు. వాటిని ప్రభుత్వం గవర్నర్‌కు పంపిస్తుంది. గవర్నర్ ఆమోదంతో విశ్వవిద్యాలయాలకు వీసీగా నియామకం చేస్తారు.

దశాబ్దంన్నర క్రితం టీయూ ఏర్పాటు

తెలంగాణ విశ్వవిద్యాలయం ఏర్పాటై దశాబ్దంన్నర గడిచిపోయింది. విశ్వవిద్యాలయం ఏర్పాటు నుంచి ఇప్పటి వరకు కోర్సుల సంఖ్య పెరిగినా పోస్టులను పెంచడం లేదు. శాశ్వత పోస్టుల నియామకం చేపట్టడం లేదు. ఈ విశ్వవిద్యాలయం క్యాంపస్‌తో పాటు బిక్కనూరు సౌత్ క్యాంపస్, సారంగపూర్ బీఈడీ కాలేజీని కలిపి మొత్తం 35 కోర్సులను నిర్వహిస్తున్నారు. వీటిలో విశ్వవిద్యాలయంలో మెజార్టీ కోర్సులను నిర్వహిస్తుండగా మిగతా కోర్సులను పీజీ కేంద్రాల్లో నిర్వహిస్తున్నారు. విశ్వవిద్యాలయం పెట్టినప్పుడు ఉద్యోగ నియామకాల కోసం రాష్ట్ర ఆర్థిక శాఖ అనుమతులు ఇచ్చిన పూర్తిస్థాయి ప్రొఫెసర్ల నియామకం చేపట్టలేదు. ప్రస్తుతం అన్ని రకాల వివాదాల్లో 90 వరకే ప్రొఫెసర్లు ఇతర ఉద్యోగులు పనిచేస్తున్నారు. మిగతా విభాగాల్లో కాంట్రాక్టు, అకాడమిక్ అసిస్టెంట్లు, ఔట్‌సోర్సింగ్ విధానంలో ఉద్యోగులు పనిచేస్తున్నారు. డిచ్‌పల్లిలో శాశ్వత క్యాంపస్‌ను ఏర్పాటు చేసిన ఇప్పటికి పూర్తిస్థాయిలో మౌలిక వసతులను కల్పించలేదు. వసతి గృహాల నుంచి తరగతి గదుల వరకు విద్యార్థులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. శాశ్వత ఆడిటోరియం నుంచి ఇతర విభాగాలకు కావాల్సిన భవనాలు లేక ఇబ్బంది పడుతున్నారు. శాశ్వత ఉద్యోగులు లేకపోవడం వల్ల తరగతులు సక్రమంగా జరగడం లేదు. పూర్తిస్థాయి ప్రొఫెసర్లు కూడా తగినంత సమయాన్ని తరగతుల నిర్వహణకు ఇవ్వకుండా ఇతర విభాగాలపై దృష్టి పెట్టడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అదనపు బాధ్యతల పేరు మీద పనులు చేస్తుండటంతో సీనియర్ ప్రొఫెసర్లు తరగతులు తీసుకోకపోవడం వల్ల సమస్యలు విద్యార్థులు ఎదుర్కొంటున్నారు.

గత వీసీ హయాంలో ఆందోళనలు..

గత వైస్ చాన్స్‌లర్ (వీసీ) హయాంలో ప్రతి రోజూ ఆందోళనలు జరిగాయి. ఆయన తీసుకున్న నిర్ణయాలు, చేపట్టిన నియామకాలు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. ప్రభుత్వం చర్యలు చేపట్టే వరకు వెళ్లాయి. ఔట్‌సోర్సింగ్ నియామకాల నుంచి రిజిస్ట్రార్ నియామకాల వరకు అన్ని వివాదాస్పదంగా మారాయి. చివరకు ఆయన ఏసీబీకి దొరకడంతో కేసులు కూడా నమోదు అయ్యాయి. గడిచిన ఆరు నెలలుగా వీసీ లేకుండానే ఉన్నత విద్యాకార్యదర్శితో ఇన్‌చార్జిగా పాలన కొనసాగుతోంది. రిజిస్ట్రార్ ఆధ్వర్యంలోనే ప్రస్తుతం అకాడమిక్ కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు.

అకాడమిక్‌పై దృష్టిపెట్టని వీసీలు

విశ్వవిద్యాలయం పరిధిలో కొన్ని కోర్సులు మినహా మిగతా కోర్సులకు క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లు రావడం లేదు. విశ్వవిద్యాలయంలో ఇప్పటి వరకు పనిచేసిన వీసీలో ఒకరిద్దరు మినహాయిస్తే ఇతర వీసీలు అకాడమిక్‌పై దృష్టిపెట్టకపోవడం వల్ల ఈ సమస్యలు ఏర్పడ్డాయి. రాజకీయ నియామకాలుగా మారడం వల్ల తెలంగాణ విశ్వవిద్యాలయం అనుకున్న విధంగా అభివృద్ధి చెందలేదు. ఈ ప్రాంత విద్యార్థులకు ఉపాధినిచ్చే కోర్సులను ప్రవేశపెట్టలేదు. ఈ విశ్వవిద్యాలయం కన్న తర్వాత మొదలు పెట్టిన విశ్వవిద్యాలయాల్లో ఉపాధినిచ్చే కొత్త కోర్సులతో పాటు బీఫార్మసీ, బీటెక్, ఇతర కోర్సులను ప్రారంభించారు. రాష్ట్ర స్థాయిలో వీసీలు దృష్టిపెట్టకపోవడం ప్రతిపాదనల వరకే పరిమితం కావడం వల్ల ఇంజనీరింగ్‌తో పాటు ఇతర కోర్సులు రాలేదు. ఉన్న కోర్సుల నిర్వహణకు కూడా కావాల్సిన మౌలిక వసతులపై దృష్టిపెట్టలేదు. భవనాల నిర్మాణంతో పాటు వసతి గృహాల నిర్మాణానికి మొగ్గు చూపలేదు. వచ్చిన వీసీలంతా నియామకాలు, ఇతర విషయాలపై దృష్టి పెట్టడం వల్ల విద్యార్థులు భారీగా నష్టపోతున్నారు. విద్యనభ్యసించడం వరకే పరిమితమై పట్టాలు తీసుకొని ఎలాంటి ఉపాధి లేకుండానే బయటకి వెళ్తున్నారు.

అన్నిటికంటే ముందే టీయూకు అవకాశం

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా వీసీల నియామకం చేపట్టడంతో అన్నిటికంటే ముందుగా తెలంగాణ విశ్వవిద్యాలయానికి త్వరగా వీసీని నియమించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వీసీ లేకపోవడం వల్ల గడువులోపు వచ్చిన దరఖాస్తులను పరిశీలించడంతో పాటు సెర్చ్ కమిటీని నియమించి వీసీని నియమించనున్నట్లు సమాచారం. విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ ప్రొఫెసర్లతో పాటు ఉస్మానియా, కేంద్రీయ విశ్వవిద్యాలయం, కాకతీయ విశ్వవిద్యాలయంతో పాటు ఇతర విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న ప్రొఫెసర్లు ఈ వీసీ నియామకం కోసం దరఖాస్తు చేయనున్నట్లు సమాచారం. జిల్లాకు చెందిన సీనియర్ ప్రొఫెసర్లు ఉస్మానియా, కాకతీయతో పాటు ఆంధ్రా విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్నారు. వీరిలో కొంత మంది వీసీగా వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ నేతలతో సంబంధం ఉన్న ఎక్కువ మంది ప్రొఫెసర్లు ఈ వీసీ పోస్టు కోసం దరఖాస్తు చేయనున్నట్లు సమాచారం. రాష్ట్ర వ్యాప్తంగా వీసీల నియామకం చేపట్టడం తెలంగాణ విశ్వవిద్యాలయంలో పాలనను గాడిలో పెట్టే వారిని వీసీగా నియమిస్తే విద్యార్థులకు మేలు జరుగుతుందని భావిస్తున్నారు.



ప్రేమ్‌కుమార్, బోధన్ మాజీ సీఐ

బోధన్ మాజీ సీఐ ప్రేమ్‌కుమార్ అరెస్టు

- హైదరాబాద్ ప్రజా భవన్ వద్ద కారు బీభత్సం కేసులో అదుపులోకి తీసుకున్న పోలీసులు
- మాజీ ఎమ్మెల్యే షకీల్ కొడుకు విదేశాలకు పారిపోయేందుకు సహకరించిన మరో పోలీసు అధికారి అరెస్టు
- పంజాగుట్ట రోడ్డు ప్రమాదం కేసులో మరో మలుపు

బోధన్ రూరల్, జనవరి 28: బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు సాహిల్ హైదరాబాద్ బేగంపేటలోని ప్రజా భవన్ దగ్గర కారుతో బీభత్సం సృష్టించిన కేసులో పంజాగుట్ట పోలీసులు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఈ వ్యవహారంలో సాహిల్‌కు సహకరించిన బోధన్ మాజీ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్‌కుమార్, షకీల్ అనుచరుడు అబ్దుల్ వాసేను ఆదివారం ఉదయం పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపడుతున్నారు. గత నెల 23వ తేదీన అర్ధరాత్రి దాటగా సాహిల్ మితిమీరిన వేగంతో కారు నడిపి ప్రజా భవన్ ఎదుట ట్రాఫిక్ బారికెడ్లను ఢీ కొట్టాడు. అతని స్థానంలో డ్రైవర్‌ను పెట్టి దుబాయ్ పారిపోయాడు. రోడ్డు ప్రమాదం తర్వాత పంజాగుట్ట ఇన్‌స్పెక్టర్ దుర్గారావుతో బోధన్ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్‌కుమార్ మాట్లాడిన కాల్ రికార్డులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రజాభవన్ ఘటనలో పంజాగుట్ట పోలీసులు బోధన్ మాజీ సీఐ ప్రేమ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు.

రోజుకో మలుపు

హైదరాబాద్‌లోని ప్రగతి భవన్ వద్ద బారికెడ్లను ఢీ కొట్టిన బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ తనయుడి కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. ఈ కేసులో షకీల్ తనయుడిని తప్పించేందుకు ఆనాడు ప్రయత్నించిన స్థానిక ఎస్‌హెచ్‌వోను పోలీసు అధికారులు సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో తనయుడిని తప్పించేందుకు ప్రయత్నించిన షకీల్ అమేర్ పేరును ఎఫ్ఐఆర్‌లో నమోదు చేశారు. అనాడు కేసులో షకీల్ అమేర్‌కు సహకరించినట్లు పంజాగుట్ట పోలీసుల విచారణలో తేలడంతో బోధన్ మాజీ సీఐ ప్రేమ్‌కుమార్‌ను ఆదివారం పంజాగుట్ట పోలీసులు అరెస్టు చేశారు. గత నెల డిసెంబరు 6న సీఐ ప్రేమ్‌కుమార్ సెలవులో ఉండగా సీసీఎస్‌కు బదిలీ చేశారు. అతడిని సీసీఎస్‌కు ఎటాచ్‌గా నియమించారు. బోధన్‌కు ఇన్‌చార్జి సీఐగా వీరయ్యకు బాధ్యతలు అప్పగించారు. అయితే శుక్రవారం వీరయ్యను బోధన్ సీఐగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, సీసీఎస్‌లో ఉన్న ప్రేమ్‌కుమార్‌కు పూర్తిస్థాయి బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ప్రేమ్‌కుమార్‌ను పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



వచ్చే నెల 2నుంచి ప్రత్యేక పాలన

- జిల్లాలో ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- పంచాయతీలకు కావాల్సిన అధికారుల జాబితా సిద్ధం
- అనుకూలమైన గ్రామాల కోసం ఆశావహుల ప్రయత్నాలు

నిజామాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో ఫిబ్రవరి 2 నుంచి ప్రత్యేక అధికారుల పాలన మొదలుకానుంది. సర్పంచుల పదవీ కాలం ఫిబ్రవరి 1న ముగుస్తుండటంతో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. గ్రామ పంచాయతీలకు కావాల్సిన అధికారుల జాబితాను సిద్ధం చేశారు. ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వగానే ఫిబ్రవరి 1న ప్రత్యేక అధికారుల నియామకాన్ని చేపట్టనున్నారు. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ ముగిసేంత వరకు ప్రత్యేక అధికారుల పాలన కొనసాగనుంది. సర్పంచుల ఎన్నికలు జరిగేంతవరకు గ్రామాల్లో ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలోనే ఈ పాలన కొనసాగనుంది.

1న ముగియనున్న పదవీకాలం

రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగించేందుకు నిర్ణయించింది. సర్పంచుల పదవీకాలం వచ్చే ఫిబ్రవరి 1న ముగియనుంది. ఫిబ్రవరి 2 నుంచి గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన మొదలుకానుంది. జిల్లాలో మొత్తం 530 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో మేజర్ గ్రామ పంచాయతీలతో పాటు మైనర్ గ్రామ పంచాయతీలు, తండా పంచాయతీలు ఉన్నాయి. మేజర్ గ్రామ పంచాయతీలకు గెజిటెడ్ అధికారులను నియమించనుండగా మిగతా గ్రామ పంచాయతీలకు మండల స్థాయిలో పనిచేస్తున్న ఉద్యోగులను నియమించనున్నారు. వీరి ఆధ్వర్యంలోనే ఫిబ్రవరి 2 నుంచి ప్రత్యేక పాలన కొనసాగనుంది. జిల్లాలో అన్ని గ్రామ పంచాయతీ పరిధిలో అధి కారులను నియమించేందుకు జిల్లా పంచాయతీ అధికారులు జాబితాను సిద్ధం చేశారు. ఎక్కువగా ఏ మండలాల్లో పనిచేస్తున్నారో ఆ మండలాల్లోనే గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారులుగా నియమించేందుకు సిద్ధమవుతున్నారు. మండల స్థాయిలో పనిచేస్తున్న అధికారులతో పాటు డివిజన్ స్థాయిలో పనిచేస్తున్న అధికారులను కూడా ఈ నియామకం చేస్తున్నారు. మండల స్థాయిలో పనిచేస్తున్న వ్యవసాయ అధికారి, ఏఈవోలు, ఇంజనీరింగ్ ఏఈలు, డీఈలు, వ్యవసాయ శాఖ ఏడీలు, ఉద్యానవన శాఖ మండల అధికారులు, పంచాయతీరాజ్, మహిళా శిశుసంక్షేమ శాఖ, విద్యాశాఖ, ఇతర శాఖల అధికారులు, ఉద్యోగులకు ఈ ప్రత్యేక అధికారులుగా నియామకం చేస్తున్నారు. ఇప్పటికే అన్ని గ్రామ పంచాయతీలకు అవసరమైన జాబితాను సిద్ధం చేశారు. కొన్ని మండలాల్లో ఉద్యోగులు తక్కువగా ఉంటే పక్కనే ఉన్న మండలం వారిని నియమించేందుకు సిద్ధమవుతున్నారు. మండల స్థాయిలో వివిధ శాఖలకు చెందిన గెజిటెడ్ అధికారులు ఉండటం వల్ల వారిని నియామకం చేస్తున్నారు. గ్రామస్థాయిలో పాలన కుంటుపడకుండా ఉండేందుకు ఈ ప్రత్యేక అధికారులను నియమిస్తున్నారు.

అధికారుల ప్రయత్నాలు

గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన తప్పనిసరి కావడంతో కొంత మంది అధికారులు ఇప్పటి నుంచే ప్రయత్నాలను చేస్తున్నారు. తాము పనిచేస్తున్న కార్యాలయాలకు దగ్గరగానే పోస్టింగ్ ఇచ్చే విధంగా చూసుకునేందుకు సిద్ధమవుతున్నారు. రెగ్యులర్‌గా చేసే ఉద్యోగంతో పాటు గ్రామాల్లో ప్రత్యేక అధికారిగా బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉండటంతో తమకు అనుకూలంగా ఉన్న గ్రామాలను ఎక్కువ మంది ఎంచుకునేందుకు సిద్ధమవుతున్నారు. సీనియర్ అధికారుల ద్వారా ప్రయత్నాలను చేస్తున్నారు. కొంత మంది స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా ఈ ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. మొత్తంగా దగ్గరగా ఉండే గ్రామాలకు వెళ్లేందుకు ప్రయత్నాలను చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే పోస్టింగ్‌లు ఇచ్చేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. జిల్లాలో గ్రామ పంచాయతీల ప్రత్యేక పాలన కోసం అధికారుల జాబితాను సిద్ధం చేశామని జిల్లా పంచాయతీ అధికారి జయసుధ తెలిపారు. ఆయా గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారులను నియమిస్తామని తెలిపారు.



పార్లమెంటరీ స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ ధర్మపురి అర్వింద్

మెజార్టీతో ఎంపీ సీటును పార్టీ గెలుచుకుంటుంది

- బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు అభ్యర్థులే లేరు
- బీజేపీ పార్లమెంటరీ స్థాయి సమావేశంలో నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

నిజామాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి నిజామాబాద్): రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో నిజామాబాద్ పార్లమెంట్‌ను బీజేపీ గెలుచుకుంటుందని నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి అన్నారు. బీజేపీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. గత ఎన్నికల్లో భారీ మెజార్టీతో ఎంపీ అర్వింద్‌ను గెలిపించారన్నారు. ఆయన ఇచ్చిన మాట ప్రకారం పసుపు బోర్డు నిర్మాణానికి కృషి చేశారన్నారు. ప్రధాని నరేంద్రమోదీ జిల్లాకు వచ్చిన పసుపు బోర్డు ప్రకటన చేశారన్నారు. రైతులకు ఇచ్చిన హామీని నెరవేర్చారన్నారు. పసుపు బోర్డుతో పాటు పరిశోధన కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయనున్నారని అన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలకు నిజామాబాద్‌లో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు అభ్యర్థులే కరువయ్యారని అన్నారు. నిజామాబాద్ పార్లమెంట్ నుంచి పోటీ చేసేందుకు ఎమ్మెల్సీ కవిత బయపడుతున్నారని అన్నారు. ఆ పార్టీ నేతలు కూడా పోటీకి ముందుకు రావడం లేదన్నారు. పదేళ్ల పరిపాలన చేసి ఎన్నికల్లో ఓడిపోగానే నియోజకవర్గాలకు కూడా ఆ పార్టీ నేతలు రావడం లేదని ఆయన విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టును డబ్బుల కోసం బీఆర్ఎస్ చేపట్టిందన్నారు. కాంట్రాక్టర్లు, వారు కావాల్సినంత దోచుకున్నారని అన్నారు. రైతులకు సాగునీరు అందించకుండా మోసం చేశారని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఆ పార్టీకి అభ్యర్థులే దొరకడం లేదన్నారు. ఇతర పార్టీల నుంచి నేతలను తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. నిజామాబాద్ కోసం సినీ నిర్మాత చుట్టూ ఆ పార్టీ నేతలు చక్కర్లు కొడుతున్నారని అన్నారు. రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో నిజామాబాద్ పార్లమెంట్ నుంచి పోటీ చేసే అభ్యర్థి గెలుస్తారని అన్నారు. పార్లమెంట్ పరిధిలో ప్రతి బూత్ నుంచి ఇంచార్జిలను నియమించి కార్యక్రమాలను చేపడుతున్నామని అన్నారు. పార్టీ కార్యకర్తకు విలువ ఇచ్చి పనులు చేస్తున్నామన్నారు. సమావేశంలో ఎంపీ అరవింద్, పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, పల్లెగంగారెడ్డి, పెద్దోళ్ల గంగారెడ్డి, లోకభూపతిరెడ్డి, వెంకటరమణి, కళ్యాణ్‌బాల్‌రెడ్డి, అల్జాపూర్ శ్రీనివాస్, బద్దం లింగారెడ్డి, మోరపల్లి సత్యనారాయణరావుతో పాటు ఇతర నేతలు పాల్గొన్నారు.

హాజరైన నేతలు

వచ్చే పార్లమెంట్ ఎన్నికల కోసం నిజామాబాద్‌లోని మున్నూరుకాపు సంఘంలో బీజేపీ సమావేశాన్ని పార్లమెంట్ ఇన్‌చార్జి నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి, పల్లెగంగారెడ్డి, వెంకటరమణి, పెద్దోళ్ల గంగారెడ్డి, లోకభూపతిరెడ్డి, కళ్యాణ్‌బాల్‌రెడ్డి, అల్జాపూర్ శ్రీనివాస్, బద్దం లింగారెడ్డి, మోరపల్లి సత్యనారాయణరావుతో పాటు ఇతర నేతలు పాల్గొన్నారు. నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, బోధన్, ఆర్మూర్, బాల్కొండ, కోరుట్ల, జగిత్యాల నియోజకవర్గాలకు చెందిన బీజేపీ పార్టీ నేతలు హాజరయ్యారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలపై ప్రధానంగా చర్చించారు.

'సాగర్ కాలువల్లోని పూడికను తొలగించి చివరి ఆయకట్టు వరకు నీరందిస్తాం'

కోటగిరి, జనవరి 28: నిజాంసాగర్ సాగునీటి కాలువల్లో పూడిక చేరి పరిస్థితి అధ్వానంగా ఉందని, పూడిక తొలగించి చివరి ఆయకట్టు వరకు నీరందిస్తామని కాంగ్రెస్ పార్టీ బాన్సువాడ నియోజకవర్గ నాయకులు ఏనుగు రవీందర్ రెడ్డి పేర్కొన్నారు. కోటగిరి, పొతంగల్ మండలాల్లో నిజాంసాగర్ కాలువలను ఆదివారం ఆయన పరిశీలించారు. డీ27, డీ27/1/2 కాలువలను పరిశీలించారు. కొత్తపల్లి, హంగర్గ ఫారం, హెగ్డోలి గ్రామాలలో సాగునీటి కాలువలు పూడిక నిండిపోయి సాగునీరు అందలేని పరిస్థితి నెలకొందని అన్నారు. ఈ సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని, రైతులకు అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శంకర్, కృష్ణారెడ్డి, భీమా సాయిరెడ్డి, హన్మంతు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కొత్తపల్లిలో సాగునీటి కాలువను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు ఏనుగు రవీందర్‌రెడ్డి

ఐరాడ్ సాంకేతిక విధానంతో రోడ్డు ప్రమాదాల నివారణ

● తగ్గుతున్న మరణాల శాతం ● సాంకేతికతో ప్రమాదాల గుర్తింపు ● 80శాతం రోడ్డు యెక్క నియమ నిబంధనలు పాటించక పోవడం వల్లనే ప్రమాదాలు


అవగాహన సదస్సులో పాల్గొన్న పోలీసులు (ఫైల్)


రోడ్డుపై సూచికలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం (ఫైల్)

ఖిల్లా,జనవరి 28: అతివేగం, నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాల బారిన పడి కుటుంబాలకు దూరం అవుతున్న వాటిని తగ్గించేందుకు ఇంటిగ్రేటెడ్ రోడ్ ఆక్సిడెంట్ డేటాబేస్ (ఐరాడ్) సాంకేతిక విధానం ద్వారా గుర్తించి నివారిస్తున్నారు. ప్రపంచ బ్యాంకు సౌజన్యంతో నేషనల్ ఇన్ఫోర్మాటిక్ సెంటర్ ఆధ్వర్యంలో 2021లో ప్రారంభం అయిన ఈ ప్రాజెక్టు మన జిల్లా విజయవంతంగా జరుగుతూ రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉంది. ఈఅప్లికేషన్ రాక ముందు రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన సమాచారం, అది ఎలా జరిగింది,మానవ తప్పిదమా,రోడ్డు వల్లనా, వాహనం వల్లనా దాని యెక్క ప్రమాద తీవ్రత ఎంత అనే కేవలం వారి వారి శాఖల ఆధ్వర్యంలోనే ఉండేవి. కాని కేంద్ర ప్రభుత్వ శాఖ అయినా నేషన్ ఇన్ఫోర్మాటిక్ సెంటర్ తీసుకొచ్చిన ఈ అప్లికేషన్ వల్ల మొత్తం సమాచారం ఒకే దగ్గరే లభించడం సాధ్యమవుతోంది. ప్రస్తుతం ఈ అప్లికేషన్‌లో దాదాపు 10ప్రభుత్వ శాఖలు ప్రమాదాల సమాచారాన్ని పొందు పరుస్తున్నాయి. గత సంవత్సర కాలంగా జిల్లాలో విజయవంతంగా దాదాపు 750పై చిలుకు రోడ్డు ప్రమాదాల వివరాలను దీనిలో పొందుపరిచారు. పొందుపర్చడమే కాకుండా ఈ అప్లికేషన్ వాళ్ల ప్రమాదాలకు గల కారణాలను కూడా మనకి వివరిస్తోంది. వీటిని ఆధారంగా చేసుకుని పోలీసుశాఖ జాతీయ రహదారుల సిబ్బందితో పాటు వివిధ శాఖల వారు ప్రమాదాలు జరుగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ఖచ్చితమైన సమాచారం కోసం ఈ అప్లికేషన్‌ను వివిధ శాఖల వారు ఉపయోగిస్తున్నారు. ఈ సంవత్సరం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో దాదాపు 300ల మంది మరణించారు. 40శాతం కన్న ఎక్కువ ద్విచక్ర వాహనాల ద్వారా జరిగాయి. వాటిలో 80శాతం రోడ్డు యెక్క నియమ నిబంధనలు పాటించక పోవడం వల్లనే జరిగాయి. ఈ సంవత్సరం డిచ్‌పల్లి, ఆర్మూర్ పరిధుల్లో ఎక్కువ ప్రమాదాలు జరిగినట్లు దీని ద్వారా గుర్తించారు. అత్యల్పంగా ఏర్గట్ల పరిధిలో జరిగాయి. నగరంలోని ఆర్టీసీ బస్‌స్టాండ్, రైల్వేస్టేషన్, గాంధీచౌక్ ప్రాంతాల్లో జరిగినట్లు అధికారులు ధ్రువీకరించారు.

● జాతీయ రహదారిపై సూచికలు

రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు జాతీయ రహదారులపై ప్రమాద సూచికలను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా డిచ్‌పల్లి నుంచి ఆర్మూర్ రహదారిపై, రాష్ట్ర రహదారులపై సూచికలను ఏర్పాటు చేశారు. ఈ సూచికల ద్వారా వాహనదారులు జాగ్రత్తలు పాటించి ప్రమాదాలను నివారించుకునే అవకాశాలు ఉన్నాయి. కొన్ని చోట్ల వేగనిరోధక సంకేతాలతో పాటు స్పీడ్‌గన్‌లను ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు.

● ఐరాడ్ పనితీరును విస్తరించాలి (సుప్రీంకోర్టు)

రోడ్డు ప్రమాదాల నివారణలో ఐరాడ్ విధానం పనితీరును, సేవలను సుప్రీంకోర్టు విస్తరించేలా చర్యలు తీసుకోవాలని సూచించడంతో ఎలక్ట్రానిక్ డటైల్ యాక్సిడెంట్ రఫోర్ట్(ఈ-ధార్)గా అభివృద్ధి చేసే పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సమన్వయమైన శాఖలతో పాటు మోటర్ యాక్సిడెంట్ క్లైమ్ ట్రిబ్యునల్, లీగల్ సర్వీసెస్ అథారిటీ, ఇన్సూరెన్స్ కంపెనీలను జతపర్చనుంది. తద్వారా బాధిత కుటుంబాలకు సత్వరమే న్యాయం చేయనున్నారు.

అవగాహన లోపంతోనే రోడ్డు ప్రమాదాలు

ప్రస్తుతం జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు అవగాహన లేకపోవడంతోనే జరుగుతున్నాయి. ప్రమాదాలను నివారించేందుకు వివిధ ప్రాంతాల్లో రోడ్డు భద్రతా వారోత్సావాలు, సదస్సులు వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో నిర్వహిస్తున్నాము. రాబోయే రోజుల్లో 30శాతం ప్రమాదాలు తగ్గుముఖం పట్టేలా వివిధ శాఖల సహకారంతో చర్యలు చేపడుతున్నాము. అదే విధంగా పోలీసు అధికారుల సహకారంతో ఈ సంవత్సరం దాదాపు 400లకు పైగా ప్రమాదాలు జరిగిన ప్రాంతాలను పరిశీలించి తీసుకోవాలసిన జాగ్రత్తలను వివరించడం జరిగింది.ముఖ్యంగా సాయంత్ర6గం టల నుంచి 7గంటల సమయంలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. గ్రామాలకు వెళ్లే రోడ్డుల్లో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. శని,ఆదివారాల్లో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించాము.

-వర్షని హంత్, ఐరాడ్ మేనేజర్

జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు స్వప్న ఎంపిక


గురుకుల విద్యార్థిని స్వప్నను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

డిచ్‌పల్లి,జనవరి 28: జాతీయ స్థాయి అండర్-19 స్కూల్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ధర్మారం(బి)గురుకుల విద్యార్థిని స్వప్న ఎంపికైందని ప్రిన్సిపాల్ సంగీత ఆదివారం తెలిపారు. గత నెల సిద్దిపేటలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలో స్వప్న మంచిప్రతిభ కనబర్చిందని ఈ నెల 29నుంచి వచ్చే నెల 1వరకు మహారాష్ట్రలోని ఔరంగబాద్ జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో స్వప్న పాల్గొంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు.ఈ సందర్భంగా స్వప్నను ఫిజికల్ డైరెక్టర్ నీరాజరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కిషన్, పీఈటీ జ్యోత్స్న, హౌజ్ టీచర్ చెన్నకేశ్వరి, లు అభినందించారు.

31న స్మారక జిల్లా స్థాయి చెస్ పోటీలు


సమావేశంలో పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు వనమాల సత్యం

పెద్దబజార్, జనవరి 28: వేములపల్లి కిరణ్‌కుమార్ 31వ స్మారక జిల్లాసాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు వనమాల సత్యం తెలిపారు. ఆదివారం నగరంలోని కోటగల్లిలోగల ఎన్ఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 31న జిల్లాస్థాయి చెస్ పోటీలను నిర్వహిస్తున్నామని అన్నారు. 18 సంవత్సరాలలోపు బాలబాలికలు పోటీలలో పాల్గొనవచ్చని అన్నారు. ఎంట్రీ ఫీజు రూ.100లు చెల్లించాలని, గెలుపొందిన విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు. జిల్లాలో గ్రామీణ క్రీడల రక్షణ కోసం పీవైఎల్ ఉద్యమిస్తుందన్నారు. క్రీడాపోటీలు అనంతరం ఈనెల 31న సాయంత్రం 5గంటలకు వర్ధంతి సభ నిర్వహిస్తామని అన్నారు. పూర్తి వివరాల కోసం 9059776869, 9618936156 నెంబర్లను సంప్రదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ నాయకులు రమేష్, భాస్కర్, రాజు, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వనంలో దివ్యాంగులకు ఉపాధి కల్పించాలి



కోటగిరిలో మాట్లాడుతున్న ఎన్‌పీఆర్‌డీ కన్వీనర్ సాయిలు

కోటగిరి,జనవరి28: గ్రామాలలోని పల్లె ప్రకృతి వనాల్లో దివ్యాంగులకు ఉపాధి కల్పించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక మండల కన్వీనర్ సాయిలు డిమాండ్ చేశారు. కోటగిరి మండల కేంద్రంలో ఆదివారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు ఉపాధి లేకపోవడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సదరం క్యాంపులను మండల కేంద్రాల్లోనే పెట్టి దివ్యాంగులకు ఇబ్బందులు లేకుండా సర్టిఫికేట్లు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు సాయిలు, కొండబాయి తదితరులు పాల్గొన్నారు.

సోలాపూర్‌లో పిరమిడ్ ధ్యాన మందిర సందర్శన


సోలాపూర్‌లో ధ్యానమందిరాన్ని సందర్శిస్తున్న మంగి రాములు

ఆర్మూర్‌రూరల్, జనవరి28: మహారాష్ట్రలోని సోలాపూర్‌లో పిరమిడ్ ధ్యాన మందిరాన్ని ఆదివారం నందిపేట కేదారేశ్వర ఆశ్రమ వ్యవస్థాపకుడు మంగి రాములు మహరాజ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్మూర్ ప్రాంతానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి వ్యాపార నిమిత్తం సోలాపూర్‌కు వలస వెళ్లి అక్కడ ధ్యాన మందిర నిర్మించడం హర్షనీయమన్నారు. ఈ ప్రాంత ప్రజలను ధ్యానులుగా, శాఖాహారాలుగా తీర్చిదిద్దారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పిరమిడ్ మాస్టర్ గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, బీఎస్ఎస్ఎన్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు సాయికృష్ణరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, సంజీవ్, నర్సయ్య, విఠల్, తదితరులు పాల్గొన్నారు.

కుద్వాన్‌పూర్ రేణుకా ఎల్లమ్మ ఆలయ కమిటీ చైర్మన్‌గా బొమ్మ సందీప్


నూతన కమిటీని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నందిపేట, జనవరి28: మండలంలోని కుద్వాన్‌పూర్ గ్రామంలో ఉన్న రేణుక మాత ఎల్లమ్మ ఆలయ కమిటీ చైర్మన్‌గా బొమ్మ సందీప్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కుద్వాన్‌పూర్ ఎల్లమ్మ దేవస్థానం ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. అధ్యక్షులుగా బొమ్మ సందీప్, కోశాధికారిగా మంగ్లరపు తుక్కన్న, వైస్‌చైర్మన్‌గా చర్లన్న, రైటర్‌గా మెట్టు గంగాధర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కమిటీని ఆర్మూర్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బైండ్ల ప్రశాంత్ ఘనంగా సన్మానించారు.ఈకార్యక్రమంలోగ్రామస్థులు, నాయకులు, తది తరులు ఉన్నారు.

ఈ నీటి ట్యాంక్ శుభ్రం చేసేదెలా?


ప్రమాదకరంగా ఉన్న నీటి ట్యాంకు మెట్లు

డొంకేశ్వర్, జనవరి28: డొం కేశ్వర్ మండలం నికాల్‌పూర్ గ్రామంలో పాఠశాల సమీపం లో మంచినీటి ట్యాంకును ఏ ర్పాటు చేశారు.ట్యాంకు మెట్లు శిథిలా వస్థకు చేరాయి. ట్యాం కును శుభ్రం చేసే సమయం లో మెట్లపైకి ఎక్కితే ఎప్పు డు ఏ ప్రమాదం జరుగుతుందోనని సిబ్బంది భయభ్రాంతులకు గురవుతున్నా రు. దీంతో నెలలు తరబడి నీటిట్యాంకు శుభ్రం చేయకుండా వదిలేస్తున్నారు. ట్యాంకు ఎక్కిచేయడానికి వీలు లేకుండా ఉంది. ట్యాంకు చుట్టూ పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగాయి.వాటినితొలగించకపోవడంతో చుట్టు అపరిశుభ్రంగా మారిం ది. ట్యాంకు లో ఉన్న నీటిని కుళాయి ద్వారా గ్రామంలోకి ప్రతీ ఇంటికి సరఫరా జరుగుతాయి.ఈనీటిని నిత్యవసరాల కోసం ప్రజలు వినియోగిస్తారు.ఉన్నతాధికారుల చొరవతీసుకొని మరమ్మతులు చేయాలని స్థానికప్రజలు కోరుతు న్నారు.

క్రీడల్లో గెలుపు ఓటములు సహజం

● బాల్కొండ కాంగ్రెస్ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్


రాష్ట్రస్థాయి బాల్‌బ్యాట్‌మెంటన్ టోర్నీ విజేత జట్లకు ట్రోఫీని అందజేస్తున్న ముత్యాల సునీల్ కుమార్

కమ్మర్‌పల్లి,జనవరి28:క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని ఓడిన వారు గెలపుకోసం ప్రయత్నం చేయాలని క్రీడాకారులు గెలుపు ఓటములను సమానస్థాయిలో స్వీకరించాలని బాల్కొండ కాంగ్రెస్ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్ అన్నారు. కమ్మర్‌పల్లి మండలకేంద్రంలోని కేబీఏ ఆధ్వర్యంలో ఇండోర్ స్టేడియంలో రెండు రోజుల పాటు కొనసాగిన రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటెన్ టోర్నమెంట్ ముగింపు ఉత్సవంలో బాల్కొండ కాంగ్రెస్ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై విజేత జట్లకు బహుమతి ప్రదానం చేశారు. శనివారం అర్థరాత్రి ఒంటిగంటవరకు ఉత్కంఠ భరితంగా సాగిన బాల్‌బాడ్మింటెన్ డబుల్స్, సింగిల్స్ ఫైనల్ క్రీడలను ఆయన తిలకించారు. ఫైనల్ మ్యాచ్ తిలకించడాకివచ్చిన క్రీడాభిమానులతో ఇండోర్ స్టేడియం క్రిక్కిరిసిపోయింది.ఈపోటీల్లో ఓపెన్ డబుల్స్‌లో నిజామాబాద్‌కు చెందిన అర్షద్, రాఘవ ప్రథమ, కేబీఏ కమ్మర్‌పల్లికి చెందిన పెంట కిషన్, మోహన్‌రెడ్డి ద్వితీయ, భైంసాకు చెందిన నవీన్, విష్ణు తృతీయ స్థానంలో నిలువగా 40ప్లస్ డబుల్స్ విభాగంలో కేబీఏ కమ్మర్‌పల్లికి చెందిన పెంట కిషన్ మోహన్‌రెడ్డి ప్రథమ, హైదరాబాద్‌కు చెందిన నవీన్ సాయి ద్వితీయ, ముప్కాల్‌కు చెందిన నవీన్ ,దినేష్ తృతీయ స్థానల్లో నిలువగా విజేత జట్లకు ట్రోఫీని నగదు బహుమతి ముఖ్యఅతిథి సునీల్ కుమార్ అందజేశారు.సమర్ధవంతంగా రాష్ట్రస్థాయి క్రీడల్ని నిర్వహించిన కమ్మర్‌పల్లి బాల్‌బాడ్మింటన్ అసోసియేషన్ (కేబీఏ) నిర్వాహకులను అభినందించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంకెట్ రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పిరెడ్డి శ్రీనివాస్, కో ఆప్షన్ సభ్యుడు పాష, స్థానిక నాయకులు పాలెపు నర్సయ్య, కేబీఏ అధ్యక్షుడు ఎండి అహ్మద్, సలహాదారుడు లుక్క గంగాధర్, సభ్యులు పాల్గొన్నారు.

మెంట్రాజ్‌పల్లిలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మెంట్రాజ్‌పల్లిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

డిచ్‌పల్లి, జనవరి 28:ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి చదువులమ్మ చెట్టు నీడలో చదువుకొని పలువురు వివిధ హోదాల్లో, వ్యాపారాల్లో పలు విభిన్నమైన ప్రాంతాల్లో ఉంటూ 28ఏళ్ల తర్వాత ఒకే చోటుకు చేరారు. డిచ్‌పల్లి మండలంలోని మెంట్రాజ్‌పల్లి ప్రభుత్వ పాఠశాలో 1995-96 పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. అప్పుడు బోధించిన గురువులను ముఖ్య అతిథులుగా ఆహ్వానించి వారి ఆత్మీయ పలకరింపులు, నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈసందర్భంగా పూర్వ విద్యార్థులంత ఒకే చోట చేరి సహపంక్తి భోజనాలు చేశారు.ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు చిన్నయ్య, లక్ష్మీనారాయణ, విక్రముల్ల, మోహన్, కొసరాజు రామకృష్ణ, నర్సింహమూర్తి, రాజేశ్వర్, వెంకటయ్యలకు విద్యార్థులు శాలువలు, మెమెంటోలతో ఘనంగా సన్మా నించారు. ఆరోజుల్లో చదువు చెప్పిన గురువులు కొందరు మరణించడంతో వారికి ప్రత్యేకంగా నివాళ్లు అర్పించారు.

మహాలక్ష్మి ఆలయంలో రూరల్‌ఎమ్మెల్యే పూజలు


మహాలక్ష్మి మందిరంలో మొక్కులు తీర్చుకుంటున్న ఎమ్మెల్యే

నిజామాబాద్ రూరల్, జనవరి 28: రూరల్ మండలం జలాల్‌పూర్ గ్రామంలోని మహాలక్ష్మి ఆలయంలో రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి మొక్కులు తీర్చుకున్నారు. రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి స్వగ్రామమైన జలాల్‌పూర్‌కు ఆదివారం ఆయన కుటుంబసమేతంగా వచ్చారు. మహాలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే దంపతులకు ఆలయ నిర్వాహకులు శాలువాతో సత్కరించారు. గ్రామంలోని సమ్యలను గ్రామమస్థులు ఎమ్మెల్యేకు వివరించారు. కొన్నేళ్లుగా జలాల్‌పూర్ గ్రామానికి బస్సు సౌకర్యం లేదని, దాంతో గ్రామానికి రావడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని, నవీపేట్ నుంచి నిజామాబాద్ వెళ్లే బస్సు రోజుకు కనీసం రెండు ట్రిప్పులు వేయించాలని కోరడంతో వెంటనే ఆర్టీసీ రీజనల్ మేనేజర్ జాన్‌రెడ్డికి ఫోన్‌చేశారు. దాంతో సోమవారం నవీపేట్ నుంచి జలాల్‌పూర్‌కు రెండు ట్రిప్పులు బస్సులు మంజూరుచేశారు. గ్రామంలోని మహాలక్ష్మి ఆలయం చుట్టూ కాంపౌండ్ వాల్, వంటచేసుకోవడానికి కిచెన్ షెడ్ నిర్మాణానికి నిదులు మంజూరు చేయమని కోరారు. త్వరలోనే ఎస్టిమేషన్ వేసి సరిపడా నిదులు కేటాయిస్తానని ఎమ్మెల్యే భూపతిరెడ్డి గ్రామస్థులకు హామీ ఇచ్చారు.

క్రీడాకారులకు నగదు పురస్కారం

మోర్తాడ్, జనవరి28: మండలంలోని సుంకెట్ గ్రామంలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విన్నర్‌గా అంబేద్కర్ యూత్, రన్నర్‌గా పాఠశాల జట్టు గెలుపొందారు. కబడ్డీ పోటీలో సెలబ్రేషన్ టీం గెలుపొందగా, ఆల్‌రౌండర్ జట్టు రన్నర్‌గా నిలిచారు. గెలుపొందిన ఇరు జట్లకు వీడీసీ అధ్యక్షుడు ప్రసాద్, శ్రీనివాస్ రూ.10 వేల నగదును అందజేశారు. ప్రభుత్వ పాఠశాలకు రూ.12వేల మైక్ సెట్‌ను వీడీసీ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు, ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

మచ్చర్లలో శివాజీ విగ్రహ నిర్మాణానికి భూమిపూజ

ఆర్మూర్‌రూరల్, జనవరి28: ఆలూర్ మండలంలోని మచ్చర్ల గ్రామంలో ఆదివారం ఛత్రపతి శివాజీ నిర్మాణానికి ఎంపీపీ పస్కనర్సయ్య భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ చైతన్యానికి, ఐకమత్యానికి ఛత్రపతి శివాజీ నిదర్శనమని అన్నారు. నేటి యువత శివాజీని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్ర మంలో సర్పంచ్ గంజి నర్సయ్య, ఉపసర్పంచ్ గంగారెడ్డి, వార్డు సభ్యులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ముగ్గురు పేకాటరాయుళ్ల అరెస్టు

బోధన్ రూరల్, జనవరి 28: బోధన్ మండలం పెంటాఖుర్దు క్యాంపు శివారులో పేకాట స్థావరంపై దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామని బోధన్ రూరల్ ఎస్ఐ నాగ్‌నాథ్ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.3,800 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. మండలంలో ఎవరైనా పేకాట నిర్వహించిన, పేకాట ఆడిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

జాతీయస్థాయి కరాటే చాంపియన్‌షిప్‌గా మెండోర కస్తూర్బా విద్యార్థులు

మెండోర, జనవరి28: జాతీయస్థాయి కరాటే పోటీలో ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌గా మెండోర కస్తూర్బా విద్యార్థులు నిలిచారని కస్తూర్బాగాంధీ పాఠశాల స్పెషల్ ఆఫీసర్ పద్మ తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన జాతీయస్థాయి కరాటే పోటీలో మొదటి స్థానంలో ఐదుగురు విద్యార్థులు రెండో స్థానంలో ముగ్గురు విద్యార్థులు, మూడో స్థానంలో నలుగురు విద్యార్థులు నిలిచారు. మొదటి స్థానంలో ఇద్దరు విద్యార్థులు నిలిచారు. ఫైట్‌లో మొదటిస్థానంలో ఇద్దరు విద్యార్థులు, రెండో స్థానంలో ముగ్గురు విద్యార్థులు, మూడో స్థానంలో తొమ్మిది మంది విద్యార్థులు నిలిచి ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌గా మెండోర కస్తూర్బాగాంధీ పాఠశాల విద్యార్థులు నిలిచి ఓవరాల్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీ అందుకున్నారని తెలిపారు. ఓవరాల్ ఛాంపియన్ ట్రోఫీ అందుకున్న విద్యార్థు లకు పాఠశాల స్పెషల్ ఆఫీసర్ పద్మ, ఉపాధ్యాయ బృందం సునీల్, కల్పన, లలిత, ఉమా తదితరులు అభినందించారు.

సీఎం, కోదండరాం చిత్రపటాలకు క్షీరాభిషేకం

రుద్రూరు. జనవరి 28 : రుద్రూరులో తెలంగాణ మలిదశ ఉద్యమ కారుల ఆధ్వర్యంలో ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి, ప్రొఫెసర్ కోదండరాం చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. ప్రొఫెసర్ కోదండరామ్‌కు ఎమ్మెల్సీ పదవి ఇచ్చినందుకు హర్షం వ్యక్తం చేస్తూ స్వీట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు రాజా వరప్రసాద్, డాక్టర్ విశ్వనాథ్ మహాజన్, నాగనాథ్,మాజీ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీకౌన్సిలర్‌కు పరామర్శ

ఆర్మూర్‌టౌన్,జనవరి28: పట్టణంలోని హుస్నాబాద్‌గల్లీలో రాష్ట్ర మార్క్‌ఫెడ్‌చైర్మన్ మార గంగారెడ్డి ఆదివారం మాజీకౌన్సిలర్ సడాక్ వినోద్‌ను పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో పడాక్ వినోద్ మాతృమూర్తి మృతి చెందడంతో పరామర్శించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సాను భూతిని తెలిపారు. ఆయన వెంట డాన్‌మహేష్, నారాయణ, సడాక్ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి సీఐగా మల్లేశ్ బాధ్యతలు స్వీకరణ


మల్లేశ్ ఎస్ఐ

డిచ్‌పల్లి,జనవరి 28:డిచ్‌పల్లి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ గా కే.మల్లేశ్ ఆదివారం సర్కిల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ..ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో ఉంటానని శాంతి భద్ర తల పరిరక్షణకు ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని ఆయన కోరా రు. సమస్యలు ఉంటే నేరుగా తన కార్యాలయానికి రావొచ్చని పేర్కొ న్నారు.

శిక్షణ కేంద్రాలను వినియోగించుకోవాలి

ఆర్మూర్‌రూరల్, జనవరి28: ఆర్మూర్ పట్టణంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని రోటరీ డిస్ట్రిక్ గవర్నర్ శంకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని మహిళలు వినియోగించుకొని భవిష్యత్‌లో ఉపాధి పొందాలని సూచించారు. రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ సేవలు ఆదర్శమని కొనియాడారు. విద్య, వైద్యరంగానికి సేవలందించడం అభినందనీయమన్నారు. గ్లోబల్ నిధుల నుంచి రూ.25లక్షలు మంజూ రుకు తన వంతు కృషి చేస్తానన్నారు. అనంతరం ఆర్మూర్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో కుర్చీలు, టేబుళ్ల వితరణ చేశారు. అంతకు ముందు సిద్దుల గుట్టను సందర్శిం చారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ శ్రీనివాస్, రోటరీ అధ్యక్షుడు పట్వారి గోపికృష్ణ, కార్యదర్శి పట్వారి తులసీ, కోశాధికారి లక్ష్మీనారాయణ, మాజీ అధ్యక్షు డు పుష్పకర్ రావు, విజయసారథి, రాజ్‌కుమార్ అగర్వాల్, మోత్కురి లింగాగౌడ్, గంగామోహన్‌చక్రు, ఎలెక్ట్ అధ్యక్షుడు రజనీష్‌కిరడ్, కాంతి గంగారెడ్డి, ఎంకె.నరేందర్, లింబాద్రిగౌడ్, రాస ఆనంద్, గోనే దామోదర్, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుకాలనీలో స్వచ్ఛ భారత్

ఆర్మూర్‌టౌన్ జనవరి28: పట్టణంలోని జర్నలిస్టుకాలనీలో కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రెండు గంటల పాటు స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ప్రతీ ఆదివారం రెండు గంటల పాటు శ్రమదానం నిర్వహించారు. కాలనీలోని రోడ్డు పొడవున పెరిగిన పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. రోడ్డుపై డ్రైనేజీ నీరు పారడంతో జేసీబీ సహాయంతో రెండు వైపులను బిగించి రోడ్డును చదును చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గొసికొండ అశోక్, ఆలయ కమిటీ అధ్యక్షుడు పుప్పాల శివరాజ్, సుంకె శ్రీనివాస్, సత్యనారాయణగౌడ్, కొంతం రాజు, ఎల్‌టి.కుమార్, ఎర్రభూమయ్య, గణేష్, మురళీ, సురేష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్‌లో జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్

ముప్కాల్, జనవరి28: ముప్కాల్ మండల కేంద్రంలోని క్రీడా మైదానంలో అండర్-17 బాలుర, బాలికల 30వ తేదీన ఒక రోజు జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు పీడీ రాజ్‌కుమార్ తెలిపారు. ప్రముఖ పారిశ్రామికవేత్త దయానంద్‌రెడ్డి జన్మదినం పురస్కరించుకొని పదవ తరగతి విద్యార్థులు ఈ పోటీలో పాల్గొంటారు. ఉదయం 10గంటల లోపు క్రీడా మైదానంలో హాజరుకావాలని తెలిపారు. దాత దయానంద్‌రెడ్డి గత కొన్నేళ్లుగా ఉమ్మడి జిల్లాలో వందకు పైగా పాఠశాలలో రూ.10కోట్ల విలువైన మౌళిక వసతులు కల్పించారని, విద్యార్థులను ప్రోత్సహిస్తూ క్రీడా దుస్తువులు, క్రీడా పరికరాలను అందిస్తున్నారని ఆయన తెలిపారు. ముప్కాల్ మండల కేంద్రంలో క్రీడా మైదానం ఏర్పాటుకు రూ.లక్ష అందించడం జరిగిందని హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని ఆయన కోరారు.

'తప్పుడు రిపోర్టులు సృష్టించిన అధికారులను సస్పెండ్ చేయాలి'


ఆర్మూర్‌లో రిలే నిరహార దీక్ష చేస్తున్న మైనారిటీ కౌన్సిలర్‌లు

ఆర్మూర్‌టౌన్, జనవరి28: ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీతపైఅవిశ్వాసం తీర్మానం నెగ్గిన తర్వాత తప్పుడు రిపోర్టులు సృష్టించిన అధికారులను సస్పెండ్ చేయాలని మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్ మున్న, మైనారిటీ కౌన్సిలర్‌లు ఇంతియాజ్‌హుస్సెన్, అబ్దుల్ రహమాన్, అతిక్, జహీర్, ఫయాజ్‌లు తెలిపారు. ఆదివారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలోని ధర్నా చౌక్ వద్ద రిలే నిరాహార దీక్షలో వారు మాట్లాడుతూ ఈనెల 4న అవిశ్వాస తీర్మానం నెగ్గినట్టు ఎన్నికల అధికారి వినోద్‌కుమార్ తెలిపి కలెక్టర్‌కు నివేదిక అందజేశారని, 25రోజులు గడుస్తున్న వైస్ చైర్మన్‌కు ఇన్‌చార్జీ చైర్మన్‌గా ఇవ్వడంలేదని మాజీమున్సిపల్ చైర్‌పర్సన్ కుటుంబసభ్యులు నిబంధనలను కాలరాయడానికి అధికార పార్టీ కాంగ్రెస్ నాయకుల వంతనచేరి కుటిల రాజకీయాలు చేస్తున్నారని అవినీతి పరులకు కాంగ్రెస్ పార్టీ మద్దతు తెలపడం సరికాదని, ముస్లీం మైనారిటీలను వ్యతిరేకిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి నశించాలని అన్నారు. అలాగే అవినీతిపరులతో కుమ్మక్కై తప్పుడు రిపోర్టులు సృషిస్తున్న జిల్లా కలెక్టర్, ఆర్డీవోలను రాష్ట్ర ప్రభుత్వం సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈధర్నాలో ముస్లిం మైనారిటీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఘర్షణ ఒకరిపై కేసు నమోదు

బోధన్ రూరల్, జనవరి 28: సాలూర మండల కేంద్రంలో మహిళల మధ్య ఘర్షణ చోటు చేసుకోవడంతో ఒకరిపై కేసు నమోదు చేసినట్లు బోధన్ రూరల్ ఎస్ఐ నాగ్‌నాథ్ తెలిపారు. మహిళా టైలరింగ్ విషయంలో మహిళల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈసందర్భంగా అనిత అనే మహిళపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

రూరల్ ఎమ్మెల్యేకు ఎన్‌సీఎస్‌ఎఫ్ కార్మికుల వినతి

● 70 నెలల పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

నిజామాబాద్ రూరల్, జనవరి 28: సారంగపూర్‌లోని సహకార చక్కెర కర్మాగార (ఎన్‌సీఎస్‌ఎఫ్) ఉద్యోగులు రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతిరెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఆదివారం ఎమ్మెల్యే నివాసంలో కలిసి వారి సమస్యలు వివరించారు. సారంగాపూర్ సహకార కర్మాగారంలో విధులు నిర్వహించిన కార్మికులకు గత 70 నెలలుగా వేతనాలు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాము గత ప్రభుత్వానికి ఎన్నోసార్లు విజ్ఞప్తి చేశామని, అప్పటి మంత్రి కేటీఆర్‌ను కలిసి మాకు రావలసి రూ.3.84 కోట్ల నిధులు విడుదల చేయమని కోరితే తాను ఫైనాన్స్ సెక్రటరీకి సైతం లెటర్ రాశారని తెలిపారు. మా సమస్యను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చి మా పెండింగ్ వేతనాలు వచ్చేలా చూడాలని కోరారు.

ఎస్‌ఎఫ్ఐ టౌన్ బాలికల సబ్ కమిటీ ఎన్నిక

నిజామాబాద్ అర్బన్, జనవరి 28: ఎస్‌ఎఫ్ఐ నగర గర్ల్స్ సబ్ కమిటీని ఆదివారం నగరంలోని మల్లుస్వరాజ్యం ట్రస్ట్ భవనంలో ఎన్నుకున్నారు. కమిటీ రాష్ట్ర సభ్యురాలు దీపిక మాట్లాడుతూ విద్యార్థినులకు రక్షణ కల్పిస్తూ నాణ్యమైన విద్యను అందించే విధంగా ప్రభుత్వం చూడాలన్నారు. నగరంలో గర్ల్స్ కాలేజీ, గర్ల్స్ స్కూల్ వద్ద ప్రొటెక్షన్‌గా షీటీమ్‌లను పర్యవేక్షణ చేస్తూ ఉండాలని ఆమె కోరారు. టౌన్ గర్ల్స్ కన్వీనర్‌గా సుమిత్ర, కోకన్వీనర్‌గా సమ్రిన్‌బేగం, కన్వెనింగ్ కమిటీ సభ్యులుగా మేఘన, వీణా, చిన్ని పద్మ, వైష్ణవి, లత, తదితరులను ఎన్నుకున్నారు.

31న జరిగే క్రీడాపోటీలను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న సాయిబాబా

మోపాల్, జనవరి 28: వేములపల్లి కిరణ్‌కుమార్ వర్ధంతి సందర్భంగా పీవైఎల్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఈనెల 31న మోపాల్ మండల కేంద్రంలో నిర్వహించే క్రీడా పోటీలను విజయవంతం చేయాలని పీవైఎల్ జిల్లా డివిజన్ అధ్యక్షుడు సాయిబాబా కోరారు. కిరణ్‌కుమార్ చదువుకుంటున్న రోజుల్లో ఉద్యమానికి ఎంతో కృషి చేశారని అన్నారు. యువకులను చైతన్యపరుస్తూ అనేక గ్రామాల్లో సంఘాలను ఏర్పాటు చేశారని అన్నారు. ఆయన మరణం మరువలేనిదన్నారు. ఆయన పేరుమీద నిర్వహించే క్రీడా పోటీల్లో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈనెల 31న ఉదయం మోపాల్ మండల కేంద్రంలోని హైస్కూల్‌లో ఉదయం 10గంటలకు పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులు తమను సంప్రదించాలని కోరారు.

కంజర్‌లో మహాలక్ష్మి ఆలయ వార్షికోత్సవం

● బోనాలతో ఊరేగింపు

మోపాల్, జనవరి 28: మండలంలోని కంజర్ గ్రామంలో ఆదివారం మహాలక్ష్మి అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవం వేడుకలను మోటాడిరెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాల నడుమ బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఓడి బియ్యం పోసి ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలందరూ సంతోషంగా ఉండాలని పాడిపంటలు బాగా పండాలని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మోటాడిరెడ్డి సంఘకుటుంబ సభ్యులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు గుడి ప్రవీణ్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, అరికెల నారాయణరెడ్డి, శంకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, కేశ్‌పల్లి గంగారెడ్డి, అరికెల ఉదయ్‌రెడ్డి, సాయిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆరెక్షత్రియ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం


ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

నిజామాబాద్ అర్బన్,జనవరి 28: ఆరెక్షత్రియ సంఘం శివాజీనగర్ నిజామాబాద్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. అధ్యక్షులుగా మీసాల సుధాకర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా మోహన్‌రావు గైక్వాడ్, కోశాధికారిగా రాజేందర్, ఉపాధ్యక్షుడిగా జగదీశ్వర్‌రావు, ఉపకార్యదర్శిగా గంగాధర్, తదితరులు కిషన్‌రావు అపర్ణ ఆధ్వర్యంలో ప్రమాణస్వీకారం చేశారు.ఇటీవల నిర్వహించిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా సంఘ నాయకులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. తమపై నమ్మకంతో తమను ఎన్నుకున్న సంఘ ప్రతినిధులకు నూతన అధ్యక్షుడు మీసాల సుధాకర్‌రావు ధన్యవాదాలు తెలిపారు. సంఘ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బాపురావు, అనిల్‌రావు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ విద్యా మహాసభలను జయప్రదం చేయాలి

నిజామాబాద్ అర్బన్, జనవరి 28: ఫిబ్రవరి 11, 12వ తేదీలలో ఖమ్మంలో జరుగనున్న టీపీటీఎఫ్ రాష్ట్ర ద్వితీయ విద్యా వైజ్ఞానిక మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు వెనిగళ్ల సురేష్ కోరారు. 1944 నుంచి ఫెడరేషన్ విద్యావ్యాప్తికి, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. విద్యాసంబంధ కార్యక్రమాలపై అనేక చర్చలు, తీర్మానాలు ఈ సమావేశాల్లో చేయడం జరుగుతోందని జిల్లాలోని ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మేధావులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలన్నారు. ఈ సభలకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రొఫెసర్లు కోదండరాం, హరగోపాల్, తదితరులు హాజరవుతారని ఆయన తెలిపారు.

వృథాగాపడి ఉన్న కమ్మర్‌పల్లి ప్రజా కల్యాణ మండపం

● లక్షలు వెచ్చించి నిర్మించినా లక్ష్యానికి దూరం ● పర్యవేక్షణ లోపం ● ఇబ్బందుల్లో గ్రామస్థులు


నిరుపయోగంగా మారిన కమ్మర్‌పల్లి ప్రజా కల్యాణ మండపం


ధ్వంసమైన విద్యుత్ స్విచ్ బోర్డు


పశువుల సంచారంతో దుర్గంధంగా మారిన కల్యాణ వేదిక హాలు

కమ్మర్‌పల్లి, జనవరి 28: పేదప్రజల కుటుంబాలల్లో అతితక్కువ ఖర్చుతో శుభకార్యాలు జరుపుకునే లక్ష్యంగా లక్షలు వెచ్చించి నిర్మించిన కమ్మర్‌పల్లి ప్రజాకల్యాణ మండపం పర్యక్షణ, నిర్వహణ కరువై అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. పేదకుటుంబాలు శుభకార్యాలు జరుపుకోవడానికి ఫంక్షన్ హాళ్లు బుక్ చేసుకునే స్థోమతలేక గ్రామంలోని ఖాళీ స్థలాలు మండపాలుగా వినియోగించుకుంటూ ఇబ్బదులు ఎదుర్కొంటున్న తరుణంలో అప్పటి రోడ్లు భవనాలశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి నియోజికవర్గ అభివృద్ధి నిధులు రూ.50 లక్షలు మంజూరు చేయించి స్థానిక మండల కాంప్లెక్స్‌కు సంబంధించిన స్థలంలో ఈనిర్మాణానికి 17 సెప్టెంబరు 2018 నిర్మాణ నిమిత్తం శంకుస్థాన చేశారు. కల్యాణ మండపం, భోజనశాలల నిర్మాణ పనులు పూర్తివడంతో 24 డిసెంబరు 2022లో కల్యాణ మండపాన్ని ఆయన ప్రారంభించారు. అయితే పేదకుటుంబాల శుభకార్యలకు భారం పడకూడదన్న సదుద్దేశంతో తన తండ్రి వేముల సురేందర్‌రెడ్డి జ్ఞాపకార్థం రూ.2లక్షల ఖర్చుతో వంటసామగ్రి కుర్చీలు తదితర సామగ్రిని సమకూర్చారు. ప్రస్తుతం ఆ సామగ్రి గ్రామ పంచాయతి అధీనంలో ఉంది. ఆయితే కల్యాణమండపం నిర్వహణ బాధ్యతలను స్థానిక గ్రామపంచాయతీకి అప్పగిస్తూ ఒక శుభకార్యానికి కేవలం రూ.5 వేలుగా చార్జీగా నిర్ణయించారు.

● ప్రారంభించి ఏడాదిగడుస్తున్న ఒక్క శుభకార్యం జరగలేదు

కల్యాణ మండపం ప్రారంభించి ఏడాదిగడుస్తున్నా ఒక్క శుభకార్యం జరుగలేదు. మంత్రి ఇచ్చిన సామగ్రి గ్రామపంచాయతి ఆధీనంలో ఉండగా పర్యవేక్షణ లేక కల్యాణ మండపం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. కల్యాణ మండపం ప్రారంభానికి ముందే కొందరు ఆకతాయిలు హుక్కా కేంద్రంగా వినియోగించారు. అది గమనించిన సదరు కాంట్రాక్టర్ బెదిరించడంతో వారు పారిపోగా హుక్కా పరికరాన్ని స్థానిక పోలీసలుకు అప్పగించారు. ఆయితే ప్రస్తుతం కల్యాణ మండపం తలుపులు విరిగిపోగా, విద్యుత్ స్విచ్‌బోర్డులు ధ్వంసమయ్యాయి. గదులు సైతం పశువుల, పందులు సంచారంతో దుర్గంధంగా మారాయి. విష కీటకాలు అంతే కాక విషకీటకాలు సంచరిస్తున్నాయి.

● అన్యాక్రాంతమవుతున్న ప్రజాకల్యాణమండపం స్థలం

నిర్వహన, పర్యవేక్షణ లోపంతో ప్రజాకల్యాణ మండపం చుట్టు స్థలం అన్యాక్రాంతమవుతున్నదన్న ఆరోపణలు లేకపోలేదు. నిర్మాణం పూర్తఆయి నిర్వహణ లేకపోవడంతో కల్యాణ మండపం చుట్టుస్థలాన్ని కొందరు కబ్జాలకు పాల్పడుతున్నారని వినికిడి, స్థలపరిశీలన జరపాలని కోరుతున్నారు.

● ప్రజలకు అవగాహన కల్పించాలి

అతితక్కువఖర్చుతో శుభకార్యాలు జరుపుకునే అవకాశం కల్పించిన విషయాన్ని స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామ ప్రజలకు అవగాహన కల్పించి కల్యాణ మండపాన్ని వినియోగంలోకి తేవాలని ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట వేస్తూ ప్రజాప్రయోజనాల నిమిత్తం నిర్మించిన ప్రభుత్వ ఆస్థికి తగు రక్షణ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు

మహిళా క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించడం అభినందనీయం



క్రీడాకారులతో జిల్లా న్యాయాధికారి సునీత కుంచాల

సుభాష్‌నగర్, జనవరి 28: జిల్లా మహిళా క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించడం అభినందనీయమని జిల్లా న్యాయాధికారి సునీత కుంచాల అన్నారు. ఖేలో ఇండియా ఆధ్వర్యంలో నగరంలోని ఉమెన్స్‌కాలేజీ మైదానంలో అండర్-13 ఖేలో ఇండియా బాలికల టోర్నమెంట్‌కు ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని జిల్లా నుంచి అంతర్జాతీయ స్థాయిలో హాకీలో రాణిస్తున్న యెండల సౌందర్య, ఫుట్‌బాల్ క్రీడాకారిణి గుగులోత్ సౌమ్య, బాక్సింగ్‌లో నిఖత్‌జరీన్,ఎవరెస్ట్ అధిరోహించిన మాలావత్ పూర్ణలను ప్రత్యేకంగా అభినందించారు.క్రీడలతో పాటుచదువుల్లోరాణించాలని జాతీయ,అంతర్జాతీయ స్థాయిలోరాణిస్తున్న మహిళాక్రీడాకారులు ఆత్మరక్షణ కోసం జూడో, కరాటేలాంటి క్రీడల్లో శిక్షణపొందాలన్నారు.ఈ కార్యక్రమంలో కోచ్‌నాగరాజు,రాష్ట్రఫుట్‌బాల్ సంఘంకార్యదర్శిబాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డిపాల్గొన్నారు. ఈసందర్భంగావిజేతలుగా నిలిచినదక్కన్ డైనమాస్ జట్టుకు రూ.30వేలనగదు,రన్నర్ జట్టుకేర్ ఫుట్‌బాల్‌జట్టుకురూ.30వేల అందజేశారు.

నేడు కలిగోట్‌కు ఎమ్మెల్యే రాక

జక్రాన్‌పల్లి, జనవరి28: మండలంలోని కలిగోట్ గ్రామంలో సోమవారం జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడానికి నిజామాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి వస్తున్నట్టు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి తెలిపారు.కలిగోట్‌లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన, ప్రారంభోత్సవం ఆయన తెలిపారు.

సీపీఐ బహిరంగ సభను విజయవంతం చేయాలి


కోటగిరిలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి

కోటగిరి,జనవరి28: సీపీఐ జాతీయ కమిటీ సమావేశాలు వచ్చే నెల 2,3,4తేదిలల్లో హైదరాబాద్‌లోని మగ్దుమ్ భవన్‌లో జరుగనున్నాయని, ఈ సమావేశాలకు దేశంలోని ఆయా రాష్ట్రాల జాతీయ నాయకులు, పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు హజరు కానున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి పీ.సుధాకర్ తెలిపారు. కోటగిరి మండల కేంద్రంలో ఆదివారం సీపీఐ నాయకులు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో జరగనున్న పార్లమెంట్ ఎన్నికలతో పాటు దేశంలో బీజేపీ నిర్వహిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రశ్నించడం జరుగుతుందన్నారు. ఫిబ్రవరి 4వ తేదిన సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో భారీ బహిరంగసభ ఉంటుందని ఈ కార్యక్రమానికి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు రాములు, విఠల్ గౌడ్, సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వం హమాలీలకు భరోసా, భద్రత కల్పించాలి'

బోధన్ రూరల్, జనవరి 28: హమాలీలకు ప్రభుత్వం భరోసా, భద్రత కల్పించాలని తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సామ్రాజ్యం అన్నారు. ఆదివారం బోధన్ పట్టణంలోని ఫంక్షన్ హాల్‌లో హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం హమాలీలకు భరోసా, భద్రత కల్పించడంలో సవితి ప్రేమ చూపిందన్నారు. ఇకనైనా కాంగ్రెస్ ప్రభుత్వం హమాలీల న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని, హమాలీలకు భరోసా, భద్రత కల్పించాలని కోరారు. తెలంగాణ ఉద్యమంలో హమాలీ కూలీలు కూడా పోరాటం చేశారని గుర్తుచేశారు. సమాన పనికి సమాన వేతనం, గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో 600 మంది తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్‌లో సభ్యత్వం తీసుకున్నారు. ఈకార్యక్రమంలో బోధన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు హనుమంతప్ప, హమాలీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న హమాలీ వర్కర్స్ రాష్ట్ర అధ్యక్షుడు

వాహనాల తనిఖీ


వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

నవీపేట,జనవరి28: మండల కేంద్రంలోని బాసర రోడ్డులో ఆదివారం సాయంత్రం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేకుండా వాహనాలు నడుపుతున్న 20మందికి పోలీసులు జరిమాన విధించారు. ఈ వాహనాల తనిఖీలో ఎస్ఐ యాదగిరి గౌడ్, ఏఎస్ఐ, పోలీసు సిబ్బంది ఉన్నారు.

బీసీ నాయకుడిపై కుట్రలు తగవు


డిచ్‌పల్లిలో మాట్లాడుతున్న ఎంపీపీ గద్దె భూమన్న

డిచ్‌పల్లి, జనవరి 28: డిచ్‌పల్లి మండల పరిషత్ అధ్యక్షుడు గద్దె భూమన్న పై ఎంపీటీసీ సభ్యులు పెట్టిన అవిశ్వాస తీర్మాణం ఈ నెల 29న నిర్వహించాల్సి ఉండగా గద్దె భూమన్న హైకోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకొని అనంతరం ఆదివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ తరుపున స్థానికంగా నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యేగా గెలిచిన, మాజీ మంత్రి బలహీన వర్గాలకు చెందిన తనను ఎంపీపీ పదవి నుంచి దించాలని ప్రయత్నాలు చేస్తున్నారని అందులో భాగంగానే బీఆర్ఎస్ ఎంపీటీసీలను కాంగ్రెస్‌లో చేర్చుకున్నారని మండిపడ్డారు. అగ్రవర్ణాలకు చెందిన బీసీలపై చిన్న చూపు చూస్తున్నారని విమర్శించారు. తనపై అవిశ్వాసం నిలిపివేయాలని హైకోర్టును ఆశ్రయించగా స్టేఇచ్చి తనకు న్యాయం చేసిందన్నారు. తాను గతంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎంపీపీగా మాజీ ఎమ్మెల్యే సహకారంతో ఎంపీపీగా అయ్యానని తాను వచ్చే ఎన్నికల్లో నిజామాబాద్ రూరల్ బరిలో ఉంటాన్నారు. ఎన్నికుట్రలు చేసిన తాను 5ఏళ్లపాటు పూర్తి స్థాయిలో ఎంపీపీగా కొనసాగు తానని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు తాను ఎలాంటి అవినీతి అక్రమాలకు పాల్పడలేదని హైకోర్టుస్టే ఆర్డర్ మంజూరు చేసిందన్నారు. ఎంపీపీ పదవి కోసం నడిపల్లి ఎంపీటీసీ చిన్నోళ్ల నర్సయ్య, అవిశ్వాస నోటీస్‌తో పాటు స్టేఆర్డర్ తెచ్చుకోవద్దని 3సార్లుకోర్టులో కేవీయట్ దాఖలు చేశారని పేర్కొన్నారు. హుందగా రాజకీయం చేయాలని అవిశ్వాస సమ యంలో ఎంపీటీసీలకు నోటీసులు ఇచ్చే అధికారం ఆర్డీవోకు లేదన్నారు.విలేకర్ల సమావేశంలో దూస్‌గాం సర్పంచ్ శివారెడ్డి, సుద్దపల్లి సర్పంచ్ రూప సతీశ్‌రెడ్డి, ఎంపీటీసీ సంతోషం, నాయకులు, బాలయ్య, లక్ష్మణ్, ప్రతాప్, చరణ్, విష్ణు, వినోద్ పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


నవీపేటలో బాలుర పాఠశాలలో పూర్వ విద్యార్థులు

నవీపేట,జనవరి28: మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో 2003-04బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 20సంవత్సరాల తర్వాత తాము విద్యనభ్యసించిన పాఠశాలలో క్లాస్‌మేట్లను కలుసుకోవడంతో వారిలో ఆనందం వెల్లువిరిసింది. ఈ సందర్భంగా తాము చేస్తున్న వృత్తి, తమ కుటుంబ సభ్యుల వివరాలను ఒకరితో ఒకరు పరిచయం చేసుకున్నారు.తమతో పాటు చదువుకుని మధ్య కాలంలో అకాలంగా మృతి చెందిన పలువురు స్నేహితులను స్మరించుకుని వారికి నివాళులు అర్పించారు.తాము తరగతి గదిలో చేసిన చిలిపి పనులను, నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.తమ ఉన్నతికి బాటలు వేసిన గురువులకు పూర్వవిద్యార్థులు శాలువ, పూలమాలతో సన్మానం చేశారు.అనంతరం తమకు విద్యను బోధించిన గురువులు నర్ర రామారావు, నర్సయ్య, శ్రీనివాస్, ప్రభాకర్, సుష్మ, రాజకళతో కలిసి పూర్వ విద్యార్థులు గ్రూప్ ఫోటో దిగారు.గురువులు, పూర్వ విద్యార్థులు కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో నరేష్, జనార్దన్, శ్రీకాంత్, రాము, సాయిబాబా, భూమేశ్వర్, గంగాధర్, అరుణ్ తదితరులున్నారు.

మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన ముత్యాల సునీల్

ఏర్గట్ల, జనవరి 28: మండలంలోని తొర్తి గ్రామానికి చెందిన రాజారపు నరేందర్ కుమారుడు ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందడంతో ఆదివారం బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు




రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.135	రూ.205	రూ. 225
వెన్‌కాబ్(కిలో)	రూ.140	రూ.210	రూ. 230

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.64,300	రూ.59,300	రూ.755

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : ఫైటర్ (హిందీ 3డీ) (8.40, 12.15, 3.50, 7.25, 11.00)
స్క్రీన్-2 : హనుమాన్ (తెలుగు) (12.00, 3.20, 6.40, 10.00)
స్క్రీన్-3 : గుంటూరుకారం (3.40, 10.10)
: నా సామిరంగ (7.00)
స్క్రీన్-4 : హనుమాన్ (12.50, 7.20)
: కెప్టెన్ మిల్లర్ (4.10, 10.40)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : కెప్టెన్ మిల్లర్ (10.30)
: హనుమాన్ (1.20, 4.25, 7.30, 10.30)
స్క్రీన్-2 : గుంటూరుకారం (1.10, 7.30)
: ఫైటర్ (హిందీ 3డీ) (4.20, 10.40)
స్క్రీన్-3 : హనుమాన్ (11.00)
: కెప్టెన్ మిల్లర్ (2.10,7.35)



దేవి : హనుమాన్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహాల్ : గుంటూరుకారం 11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : ఫైటర్ (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : కెప్టెన్ మిల్లర్ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్